# శేషప్రశ్న

-కొత్తపల్లి త్రినాధరాజు

మెట్‌పల్లి బస్టాండు రద్దీగా వుంది. ఎవరి గమ్యం వైపు వాళ్ళ హడావుడి. బస్సుకోసం ఆదుర్దా. ఓ నిండు చూలాలు తనకూడా మరో నలుగురి పిల్లలతో నడుంపై చేయి వేసుకుని అడుగు అడుగుకీ శక్తిని కూడదీసు కుంటూ వచ్చి ఆగింది. అంతలోనే ఆమె వెనుక నుండి ఒక మగాడు హడావుడిగా వస్తూనే ఆమెనేదో అడుగు తున్నాడు. ఆమె సమాధానం చెబుతుండగానే కాస్త హుందాగా కన్పిస్తున్నానేమో నావేపు అతని చూపు పడి నట్లుంది. అదే తడవుగా నా దగ్గరకొచ్చాడు.

"అయ్యా! బాబయ్యా!! చూస్తుంటే పెద్దింటి బిడ్డలా వున్నారు. అదిగో చూడండి బాబూ ఆళ్ళే... ఆళ్ళే నా సంసారం బాబూ ఆ నిండు చూలాలుందే అది నా భార్యే బాబూ. ఇప్పటికి నలుగుర్ని కంది. "ఎందుకే మనకంత సంతానం అంటే వినకుండా ఇప్పుడు మరొకరి కోసం సిద్ధమైంది బాబూ..." తన ప్రమేయమే లేదన్నట్లుంది అతని ఫీలింగ్. నేను మౌనంగానే వున్నాను. మరలా తనే చెప్పటం మొదలెట్టాడు. "బాబూ మా ఆవిడకు ఈరోజో, రేపో పురుడు వస్తుంది. చేతిలో చిల్లగవ్వలేదు. నెల రోజుల నుండి ఆసుపత్రికీ వెళ్ళలేదు. కాస్త పెద్దమనసు చేసుకుని ఓ ఐదు వందలు ధర్మంగా సాయం చేయండి బాబూ. బ్రతుకు బాగుంటే తీర్చేస్తాను బాబూ...!" నేనే హోదా తెలుసున్న వ్యక్తిలా ప్రాధేయపడ్డాడు. ఆమె వేపు చూశాను. నిస్తేజంగా కన్పించింది. జాలిగా ఆమె వేపు చూస్తూనే జేబులోంచి పర్సు తీశాను. గుటకలు మింగుతూ చూస్తున్నాడతను. అతని కళ్ళలో నేనెంతిస్తానోనన్న ఆశ కన్పించింది. ఓ మూడు వందలు తీసి "ఇవిగో ముందామెను ఆస్పత్రికి తీసుకెళ్ళు" అంటుండగానే లాక్కున్నట్లే నా చేతిలోంచి అందుకున్నాడతను. అప్పుడు అతని మోములో వేయి ఓల్టుల కాంతి కన్పించింది. "వస్తాను బాబయ్యా!" అంటూ అక్కడి నుండి భార్యా పిల్లల్ని తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు. వాళ్ళు వెళుతున్న వేపు చూస్తూనే అసహనంగానే నిట్టూరుస్తూ బస్సుకోసం ఎదురు చూస్తూ కూర్చుండిపోయాను.

మరో పది నిముషాలకి బస్సు వచ్చింది. ఎక్కి కూర్చున్నాను. బస్సు బయలుదేరింది. ఎందుకో నేనెక్కిన బస్సు అంతగా రద్దీలేదు. సింగిల్‌గానే కిటికీ వేపు కూర్చున్నాను. కాంప్లెక్స్ దాటుకుని బైపాస్ వేపు మలుపు తిరుగుతోంది బస్సు. అదే మలుపు చివర తన నలుగురి పిల్లలతో కూర్చుని వుందా గర్భిణి. వాళ్ళని దాటుకుంటూ కాస్త ముందుకెళ్ళి ఆగింది బస్సు. ఎవరో బస్సుపైన లగేజి వేసుకుంటున్నారు. ఆ ప్రక్కనే బ్రాందీ షాపు వుంది. ఆ షాపు వేపు నాకళ్ళు మళ్ళాయి. ఒక్కసారిగా నాలో ఉలికిపాటు. ఇందాక

## స్వదేశంలో విదేశం

తొడుక్కున్న వాళ్ళ
ఖదర్ పెంచుతూ
తోపులాటలో నలిగి
ఖతమవుతూ ఖాదీ

ధాన్యం మోస్తూ
దాస్యం చేస్తూ
ద్వార తోరణాలను మోస్తూ
ఫైబర్ దారాల తాకిడితో
తునాతునకలై
బంధాలు తెంచేసుకుంటూ
దైన్యంగా జౌళి

పాత్రలుగా ప్రతిమలుగా
పంటల నిండు కుండలుగా
మలచిన చేతుల్లోంచి జారి
మౌనంగా మట్టి

హృదయంతో ఉదయించీ
ఉదరంతో పయనించీ
తూర్పుగాలి వదిలేస్తూ
పశ్చిమంలో అస్తమిస్తూ

వలసలుపోతూ
విలువలోడుతూ
వ్యామోహంతో పడుతూ లేస్తూ
వట్టిపోతున్న స్వదేశంలో
గట్టిపడుతున్న విదేశం

-గంద్ర లక్ష్మణరావు

తన భార్య ఆసుపత్రి కోసం అని ప్రాధేయపడ్డతను అమృతాన్ని సేవిస్తున్నట్లుగా గ్లాసుని ముద్దాడుతూ గటగటా లాగిస్తున్నాడు. ఆశ్చర్యమేసింది నాకు. తాగిన గ్లాసుని ప్రక్కన పెడుతూ జేబులోంచి డబ్బులు తీసిచ్చాడు. చిల్లరతోపాటుగా మరో బాటిల్‌ని అందుకున్నాడు. హుషారుగా బయటకొస్తూ బస్సు వేపు చూశాడు. నేను కన్పించే సరికి తన నడకని పరుగుగా మార్చాడు,. బస్సు బయలు దేరింది. "ఓరి నీచుడా?" అని అను కున్నాను. 'అసలు – వాడికి డబ్బులెందుకిచ్చానా?" పరిపరి విధాలుగా మనసుకి బాధ కలిగింది. అలాగే ఇల్లు చేరాను. అయినా మనసులో ఏదో మూల ఏదో తెలీని బాధ బయటకు రావటానికి ప్రయత్నిస్తూనే వుంది.

మర్నాడు పనుండి మెట్‌పల్లి బయలుదేరాను. బస్ కాంప్లెక్స్‌లో బస్సు దిగి బయటకొచ్చాను. బయట జనం గుమికూడి వున్నారు. ఏడ్పులు విన్పిస్తున్నాయి. నేను అటు వేపు వెళ్ళాను. నిన్నటి నిండు చూలాలు విగత జీవిగా పడుంది. పిల్లలు ఏడుస్తూనే వున్నారు. "కాన్పు కష్టమైందట" ఎవరో అంటున్నారు. అతగాడు భార్య శవాన్ని అడ్డం పెట్టుకుని అడుక్కుంటం మానలేదు. అతని చూపుల్లో భార్య పోయిందన్న బాధ లేదు. పిల్లలేమైపోతారన్న భయం కన్పించటం లేదు. ఏదో ఆశ కన్పిస్తోంది అతనిలో నాకు బహుశా జనం ఇస్తున్న డబ్బుల కోసం లావుంది. కనీసం పిల్లల్ని ఓదార్చుదామన్న ధ్యాస కూడా లేదతనికి. అందరి లానే ఏమీ చెయ్యలేక వెనుదిరిగాను. ఆ పిల్లలు ఏడుస్తున్న తీరు మనసులో బాధ కన్నీటి రూపంలో గుండెల పై నుండి రాలుతుంటే వాటిని తుడవాలని అన్పించటం లేదు. మనసలా వుంటే 'పనుంటే తర్వాత చూసుకోవచ్చులే' అని బస్టాండ్ లోపలికి నడిచాను. కమ్మరపల్లి అదే మావూరెళ్ళే బస్సులేదు. అసహనంగా బెంచీపై కూర్చున్నాను. కాస్త దూరంలో మరొకతను తన ఇద్దరి పిల్లలతో "తల్లి లేని పిల్లలు బాబూ...." అంటూ అడుక్కుంటున్నాడు. ఇతని మోములో కూడా పిల్లలపై ప్రేమ కన్పించట్లేదు నాకు. జనం ఇచ్చే ధనం పైనే ఆశ, ప్రేమ కన్పిస్తున్నాయి. వాడు నా వేపు వస్తుండగానే బస్సు వచ్చింది. ఎక్కి కూర్చున్నాను. బస్సు బయలు దేరింది. మనసు గిజగిజలాడిపోతోంది. "ఇది విధి నైజమా? లేక ఎప్పటికీ మారని ఆ ఇద్దరిలాంటి మగాళ్ళ నైజమా?" ఈ ప్రశ్నలు నా మనసులో శేష ప్రశ్నలాగానే మిగిలిపోయాయి. ■

# 'రాజం' నానీలు

అమ్మ / అంటే అర్థం ఏంటి డాడీ?
అని అంటున్నారు / ఈ కాలం పిల్లలు
నేటి కాలంలో / ఓనమాలు రానివాడికి కూడ
'ఎయిడ్స్' / పాఠాలు

పుస్తకాలే / మోయడంలేదు
పెద్దయ్యాక / బరువు బాధ్యతలేం మోస్తాడో!
భూమిలో / నీళ్ళు ఇంకిపోయాయి
రైతు / కళ్లల్లో కన్నీళ్లలాగే!

బాల్యం / కొవ్వొత్తి కరిగిపోయింది
జ్ఞాపకాల మైనం మాత్రం / మిగిల్చింది.
చెట్టుకు / విత్తు ఎలాంటిదో
మనిషికి / బాల్యం కూడా అలాంటిదే!

కాలుష్యం / మనిషికి కృతజ్ఞతలంటోంది
తన్ను ముద్దుగా / పెంచుతున్నారని!
చెట్టు / చచ్చీ సంతోషిస్తుంది
మనిషి / అవసరాలను తీర్చానని!

పుష్పం / కలవరిస్తోంది
సైనికుని / పాదాలనంటుకోవాలని!
చెట్టు / ఆకాశాన్నంటాలనుకుంది.
మనిషి కన్ను పడింది / ఇక అంతే!

క్యాలెండర్‌ని
చింపి పారేశావ్ సరే!
మరి కాలం
ఆగిపోతుందా!
న్యాయం / తప్పిపోయింది
ఎవరైనా వెతికి పెడితే
బాగుండు!

చెట్లు
వేడుకొంటున్నాయి
మరో జన్మకైన
కలకాలం ఉండాలని!
చెట్టు / నిస్సహాయంగా రోధిస్తుంది
మనిషి కొట్టె / గొడ్డలి దెబ్బలకు

ఎడ్ల కష్టాలు
నెరవేరబోతున్నాయి
యంత్రాలు
వచ్చాయి కదా!

–రాజం మల్లేష్